క్లుప్తంగా

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ ఏఈఈ రాధాకృష్ణారెడ్డి అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 8న జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని 22వ బ్లాక్ వద్ద, 9న చింతల్‌లోని హనుమాన్ ఆలయం వద్ద, 10న అంజయ్యనగర్ కల్లు కంపౌండ్ వద్ద తమ సిబ్బంది ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారని తెలిపారు. వినియోగదారులు నేరుగా బిల్లులు చెల్లించుకోవచ్చని అన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు షురూ



సాయినగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి సాయినగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. స్థానికంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు మురుగుతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై స్థానిక కార్పొరేషన్ కాసాని శిరీష స్పందించి కౌన్సిల్ సమావేశంలో సమస్యను లేవనెత్తి నిధులు మంజూరు చేయించారు. ఎట్టకేలకు మురుగు సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: ప్రపంచ తల్లుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంఏఎంఎస్) ఆస్పత్రిలో ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉచితంగా డెలివరీలు నిర్వహించడంతో పాటు మెటర్నిటీ కిట్‌లు, స్పెషల్ గిఫ్ట్ వోచర్లను ఇవ్వనున్నారు. గర్భిణులకు ఉచిత భోజన సదుపాయంతో పాటు మందులు ఇవ్వనున్నామని తెలిపారు. గర్భిణులు ముందస్తుగా ఫోన్ నం.9676242706 /9963116787/9010040434/8686739143లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. వెంటిలేటర్ సదుపాయం కల్పించడం లేదని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బుద్ధుడి బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకాలు



గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద దీపాలు వెలిగిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: గౌతమ బుద్ధుని బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సాంతిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం గాజులరామారం డివిజన్ అంబేడ్కర్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పున్నారెడ్డి బుద్ధుని విగ్రహం వద్ద దీపాలు వెలగించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లాల్‌మహమ్మద్, రాజారెడ్డి, జైభారత్‌రెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీడిమెట్ల ట్రాఫిక్ సీఐగా వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్: జీడిమెట్ల ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న చంద్రశేఖర్ సైబరాబాద్ సీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సీపీ కార్యాలయంలో క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న వెంకట్‌రెడ్డిని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మురుగు సమస్య పరిష్కరించండి



కొంపల్లి ఎస్ఎస్ఆర్ గార్డెన్ సమీపంలో నిలిచిన మురుగు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఎస్ఎస్ఆర్ గార్డెన్ సమీపంలో మురుగు నిలిచిపోయింది. కొన్ని నెలలుగా ఇదే సమస్య ఉండగా అటువైపుగా వెళ్లేవారు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ సర్వీస్ రోడ్డులో వాహనాలు వెళ్లాలంటే ఇటు వైపు గానే వెళ్లాలి. దీంతో అటు వాహనదారులు ఇటు ప్రజలు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వార్డు కార్యాలయాల ఏర్పాటు

ప్రజలకు చేరువయ్యేందుకు..

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం వార్డు కార్యాలయాల ఏర్పాటు చేయనుంది. ఒక్కో డివిజన్‌లో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారులతో పాటు ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, వెటర్నరీ, విద్యుత్, టౌన్ ప్లానింగ్ ఇలా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రజలు నేరుగా వార్డు కార్యాలయానికి వెళ్తే పనుల య్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెలాఖరులోగా కార్యాలయాలకు భవనాలను సమకూర్చి సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని మంత్రి కేటీఆర్ ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోనల్ అధికారులు వార్డు కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.



వార్డు కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను సందర్శించేందుకు వస్తున్న జోనల్ కమిషనర్ మమత

కుత్బుల్లాపూర్: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత శనివారం మూసాపేట్, కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని భవనాలను ఎంపిక చేసే పనిలో బిజీబిజీగా కనిపించారు. ఆయా సర్కిళ్ల వారీగా భవనాల ఎంపిక పూర్తి చేసి నివేదిక అందించనున్నారు. ఈ నెలాఖరు వరకు కార్యాలయాల ఎంపిక పూర్తి చేసి మరమ్మతులు చేపట్టి జూన్ మొదటి వారంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

గాజులరామారం సర్కిల్ పరిధిలో వార్డు కార్యాలయాలు.!

- చింతల్ డివిజన్‌లోని భగత్ సింగ్‌నగర్‌లోని మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ వద్ద కార్యాలయం ఏర్పాటు చేస్తే అక్కడ పార్కింగ్‌తో పాటు ప్రజలకు అనువుగా ఉంటుందని నివేదిక తయారు చేశారు.
- సూరారం డివిజన్‌లో నెహ్రూనగర్ ప్రధాన రోడ్డుపైనే ఉన్న కమ్యూనిటీ భవనాన్ని ఎంపిక చేసి అందులో జిమ్ సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలించి కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు.
- జగద్గిరిగుట్ట డివిజన్‌లో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్‌ను కార్యాలయానికి అనువుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దుతున్నారు.
- గాజులరామారం మహాదేవపురం సమీపంలో ఉన్న కమ్యూనిటీహాల్ కార్యాలయం ఏర్పాటు కోసం సంక్షేమ సంఘం ప్రతినిధులతో అధికారులు మాట్లాడారు.
- అందుకు వారు సానుకూలంగా స్పందించడంతో అక్కడే కార్యాలయం ఏర్పాటు కోసం ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధాన రోడ్డు వేస్తే ఈ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అనువుగా ఉంటుంది.

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో వార్డు కార్యాలయాలు.!

- జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్‌లో గ్రేటర్ నిధులతో నిర్మించిన మోడల్ మార్కెట్ భవనం మరమ్మతులు పూర్తిచేసి కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు.
- సుభాష్‌నగర్ డివిజన్‌లో మోడల్ మార్కెట్ కోసం ప్రతిపాదనలు చేసి మధ్యలో శ్లాబ్‌లు వేసి నిలిచిపోయిన వాటికి మరమ్మతులు చేసి అక్కడే కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- రంగారెడ్డినగర్ డివిజన్‌లో గాంధీనగర్ కమ్యూనిటీహాల్ కార్యాలయానికి అనువుగా ఉంటుందని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.
- కుత్బుల్లాపూర్ డివిజన్లో పద్మనగర్ ఫేస్–2లో ఉన్న కమ్యూనిటీహాల్ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు.

వచ్చేనెలలో అందుబాటులోకి...



వార్డు కార్యాలయాలు ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయి. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. వీటి ఏర్పాటుతో డివిజన్లలో ఏమి జరుగుతుందో అప్పటికప్పుడే తెలుసుకునే అవకాశం ఉంటుంది. అన్ని శాఖల అధికారులు ఒకే చోట ఉండటం ద్వారా సత్వర పరిష్కారం దొరుకుతుంది. వచ్చేనెల మొదటి వారంలో అన్ని కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయి.

– మమత, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్

భూ'సర్వే' మాయ!

- వాస్తవ పరిస్థితికి భిన్నంగా నివేదికలు
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యం
- తప్పుల తడకగా ల్యాండ్ సర్వే విభాగం నివేదికలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: భూ సర్వే సిబ్బంది మాయాజాలంతో విలువైన భూముల లెక్కలు తారుమారు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఒక ప్రాంతంలోని ఒక స్థలాన్ని వేర్వేరుగా ఇద్దరు సిబ్బంది సర్వే చేసి భూకొలతలపై భిన్నంగా నివేదికలు అందజేయడం అనుమానాలకు తావిస్తోంది. కొందరికి ప్రయోజనం చేకూర్చేలా, మరి కొందరికి నష్టం కలిగించేలా చేతివాటం ప్రదర్శించడం ఆందోళన గురిచేస్తోంది. భూసర్వే కొలతల అక్రమాలపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తున్నా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరు నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్న చందంగా తయారైంది. భూసర్వే కొలతల వ్యవహారంలో భారీగా చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఒక అధికారి నిర్లక్ష్యం, అసమర్థత కారణంగానే భూసర్వే వ్యవహారంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- వివాదాస్పద భూములకు సైతం క్లీన్ చీట్ ఇవ్వడం.. మరోవైపు కొలతల రిపోర్టునకు భారీగా వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.
- అల్వాల్ మండలంలోని యాప్రాల్ ప్రాంతంలో 198 సర్వే నంబరులో 2015లో ఒకసారి, 2017లో మరోసారి భూసర్వే చేసినా అప్పటి మండల సర్వే సిబ్బంది 10 గుంటల స్థలం ఉందని పేర్కొంటూ సర్వే నివేదిక అందజేశారు. అదే స్థలాన్ని తాజాగా 2023 మార్చిలో 30 గుంటల స్థలంగా పేర్కొంటూ కొలతల నివేదిక సమర్పించడం అనుమానాలు కలిగిస్తోంది. ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది.
- దుండిగల్ రూరల్ పరిధిలోని గాగిలాపూర్ 214 సర్వే నంబర్ సంగారెడ్డి– మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉంటుంది. ఇక్కడ రెండు ఎకరాల స్థలాన్ని తప్పుడు కొలతలతో ఏకంగా హద్దులు మార్చివేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కుదిరిన ఒప్పందంలో భాగంగా కొంత మాత్రమే ముట్టడంతో నివేదిక సమర్పించడంలో కాలయాపన సాగుతున్నట్లు తెలుస్తోంది.
- ఉప్పల్ మాజీ ప్రజాప్రతినిధి నాగోల్ విలేజి సమీపంలో సర్వే నంబర్ 124లోని ఓ ప్లాట్ విషయంలో నివేదిక ఇవ్వాలని భూసర్వే ల్యాండ్ విభాగంలో సంప్రదించగా, భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రూ.2 లక్షలు ముట్టజెప్పినా.. మరింత ఇస్తేనే లైన్ క్లియర్ చేస్తానని చెప్పడంతో సదరు మాజీ ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.
- దుండిగల్ మండలంలోని సాయినాథ్ సొసైటీలో స్థలాల వివాదం కోర్టులో ఉన్నప్పటికీ కొన్ని స్థలాలకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది.



ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

బాలానగర్: ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి విద్యలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడం గొప్ప విషయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం బాలానగర్‌లోని చిత్తారమ్మ బస్తీ ఆవరణలో ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేస్తుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లు, కుట్టు మెషిన్లను అందజేశారు. ఖార్డు స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఏఎండీ డైరెక్టర్ అనిల్‌కుమార్, గోపాల్‌కృష్ణ, ఖార్డ్ సంస్థ సభ్యులు సుమన్ దంపతులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శాఖయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవంతినగర్ తోటలో శిక్షణ శిబిరం ప్రారంభం

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలో ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు ప్రతి డివిజన్‌లో సంస్థ సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, సత్యం, ఉదయ్, ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల దొంగల ముఠా అరెస్ట్

- రూ.1.60 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్రా

భువనగిరి: పశువులను అపహరించుకుపోతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్రా నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల, సూరారం పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ సోహెల్, పల్ల ఠాకూర్‌రాజ్ సింగ్, మహ్మద్ వసీమ్‌తో పాటు మరో బాలుడు కలిసి కొంతకాలంగా గ్రామ శివారుల్లోని పశువుల కొట్టాల వద్ద గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను అపహరిస్తున్నారు. సమీపంలో ఏర్పాటు చేసుకున్న వాహనంలో వాటిని ఎక్కించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామంలో రామిడి మల్లారెడ్డి వ్యవసాయ బావి వద్దకు చేరుకున్నారు. అక్కడ కొట్టంలోని ఆవులు, గేదెలు, మేకలను తమ వెంట తెచ్చుకున్న వాహనంలోకి ఎక్కిస్తున్నారు. ఈ క్రమంలో పశువులు అరవగా స్థానికులు గమనించి కేకలు వేశారు. దీంతో ఎవరో వస్తున్నట్లు భావించి భయంతో వెంటనే పశువులతో పాటు వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు బొమ్మలరామారం చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి అనుమానాస్పదస్థితిలో కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నాగినేనిపల్లి గ్రామంలో పశువుల దొంగతానికి యత్నించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.60లక్షల నగదు, రెండు కార్లు, అశోక్ లేలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో మహ్మద్ సోహెల్, ఠాకూర్‌రాజ్ సింగ్ హైదరాబాద్‌లోని దుండిగల్‌లో ఓ ఇంట్లో చోరీ, రెనిబజార్ పరిధిలో పశువుల దొంగతనానికి పాల్పడి జైలుకు సైతం వెళ్లి వచ్చారు. కాగా, ఇప్పటికే వీరిపై భువనగిరి రూరల్, యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

డబ్బా వేసుకుంటా.. అడ్డా చేసుకుంటా!



మూడు నెలల క్రితం వేసిన డబ్బా



శనివారం కొత్తగా వెలసిన డబ్బా

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప సమీపంలోని మోడల్ మార్కెట్ వద్ద ఇటీవల ఒకరు డబ్బా వేసారు. ఆ డబ్బా విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ డబ్బాకు ఆనుకొని మరో గుడిసే వేసారు. ఇది జరిగి 3 నెలలు కావస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇదే అదునుగా మోడల్ మార్కెట్ ఎదురుగా శనివారం మరో డబ్బా వేసారు. ఇకనైనా అధికారులు ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోకపోతే రోజుకో డబ్బా వెలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

సత్తాచాటిన ఎంఎల్ఆర్ఐటీ

దుండిగల్: టీహబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ (సీఎస్ఐ) లార్జెస్ట్ స్టూడెంట్ బాడీ, బెస్ట్ ఎమర్జింగ్ స్టూడెంట్స్ విభాగాల్లో రెండు అవార్డులను గెలుచుకుని దుండిగల్‌కు చెందిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల సత్తా చాటింది. శనివారం రాష్ట్ర సెక్రటరీ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జయేష్ రంజన్, జెఎన్‌టీయూహెచ్ రెక్టార్ ప్రొ. గోవర్ధన్‌ల చేతుల మీదుగా ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎస్ఐ ఎంఎల్ఆర్ఐటీ స్టూడెంట్స్ చాప్టర్ బాడీ ప్రతిష్టాత్మక అవార్డులు గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. దీనిలో ఎస్‌బీసీ కో.ఆర్డినేటర్లు విద్య, అనిత, శ్రీనివాస్‌రెడ్డి సహకారం ఎంతో ఉందన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని కాలనీలకు మెరుగైన వసతులు కల్పించడమే తన ధ్యేయమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని రింగ్‌బస్తీలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డివిజన్‌లో పరిధిలో డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు.

శోకసంద్రంలో సాయిబాబానగర్

సుభాష్‌నగర్: మెదక్ జిల్లా ఏడుపాయల యాత్రలో భాగంగా మెదక్ జిల్లా కోడిపల్లి మండలం మహమ్మద్ నగర్‌లో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్‌కు చెందిన ముగ్గురు మృతి చెందారు. దీంతో స్థానికంగా విషాదఛాయలో అలుముకున్నాయి. నాగరాజు, లత దంపతుల పెద్ద కుమార్తె వైశాలి(16) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. శనివారం సాయంత్రం 4గంటల సమయంలో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో స్థానికంగా రోదనలు మిన్నంటాయి. ప్రమాదంలో మృతి చెందిన నాగలింగరాజు, వెంకటరమణ దంపతుల మృతదేహాలను నేరుగా షాపూర్‌నగర్‌లోని శ్మశానవాటికకు తరలించారు.



వైశాలి మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

అమర్‌నాథ్ యాత్రికులకు ఉస్మానియాలో వైద్య పరీక్షలు

అఫ్జల్‌గంజ్: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పర్యవేక్షణలో ముగ్గురు వైద్యులకు ఈ బాధ్యతలు అప్పగించారు. సోమ, గురువారాల్లో డాక్టర్ కేఎంకే రెడ్డి (కార్డియాలజీ) ఆధ్వర్యంలో అవుట్ పేషంట్ బ్లాకులోని రూమ్ నంబర్ 208 వద్ద, మంగళ, శుక్రవారాల్లో డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్ (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో ఎంఆర్‌డీ బిల్డింగ్‌లోని రూం నంబర్ 507 వద్ద, బుధ, శనివారాల్లో డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో ఓపీ బ్లాకులోని రూమ్ నంబర్ 125 వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈసీజీ, 2డీ ఈకో, ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే వారు తమ ఆధారు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 99896 76293 నం.లో సంప్రదించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు.

జీఓ.59 ముసుగులో ప్రభుత్వ స్థలాల కబ్జా

నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్

నిజాంపేట్: ప్రభుత్వం ప్రకటించిన జీఓ.59 ముసుగులో ప్రభుత్వ స్థలాలను కబళించేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు యత్నిస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బాచుపల్లి మండల సర్వే నం.186లోని హౌసింగ్ బోర్డుకు చెందిన 6 ఎకరాల స్థలంలో కొందరు వ్యక్తులు మట్టి పోసి చదును చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు శనివారం సదరు స్థలం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. జీఓ.59 కింద స్థలాన్ని కబ్జా చేసేందుకు అధికార పార్టీ నాయకులు యత్నిస్తున్నారని అన్నారు.

- దీనికి అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ విషయంపై మండల రెవెన్యూ, హౌసింగ్‌బోర్డు అధికారులు స్పందించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని కోరారు. అధికారులు మొద్దు నిద్ర వీడకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాశి, నిజాంపేట్ కార్పొరేషన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుంటి రాము, స్థానిక ప్రజలు ఉన్నారు.



నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప స్థలం కబ్జాపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



భూమిరెడ్డినగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఫస్ట్ ఎవెన్యూ కాలనీ, వెంకన్నహిల్స్, భూమిరెడ్డినగర్, శివరెడ్డినగర్ మీదుగా ప్రవహిస్తున్న నాలాలో చెత్తా చెదారాలు పేరుకుపోయింది. శనివారం నాలాలో పూడికతీత పనులను భరతసింహారెడ్డి దగ్గరుండి పరిశీలించారు. పనులు వేగంవంతంగా పూర్తి చేయాలన్నారు. భూమిరెడ్డి కాలనీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, శివారెడ్డి కాలనీ అధ్యక్షుడు వెంకటేష్, నార్లకంటి దుర్గయ్య, పెద్ద మల్లేశంచారి, సుభాష్, నాగేష్, తిరుపతి, దుర్గారావు, శ్రవణ్, వరుణ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు





టీపీసీసీ ప్రతినిధి, మాజీ ఎంపీపీ కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం బాచుపల్లిలోని ఆయన నివాసానికి కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని హన్మంతరెడ్డితో కేక్‌లు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. – నిజాంపేట్